

దెబ్బతిన్న వరి పైరును చూపుతున్న చంద్రబాబు





మాట్లాడుతున్న చంద్రబాబు, టీడీపీ జెండాలతో యువకులు

వేదవతి ప్రాజెక్టును పూర్తి చేస్తాం

- ప్రతి పల్లెకు సాగు, తాగు నీరందిస్తాం
- నగరడోన జలాశయం పూర్తి చేస్తాం
- డిగ్రీ కళాశాలకు పక్కా భవనాల నిర్మాణం
- టీడీపీ ద్వారానే సామాజిక న్యాయం
- ఆలూరు ప్రజాగళం సభలో టీడీపీ అధినేత చంద్రబాబు

కర్నూలు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి)/ఆలూరు/ఆదోని: రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన ప్రాంతం ఆలూరు.. ఈ ప్రాంతంలో కరువును నివారించాలని 8 టీఎంసీల సామర్థ్యంతో వేదవతి ప్రాజెక్టు చేపడితే.. జగన్ ప్రభుత్వం వచ్చాక ఈ దుర్మార్గుడు 3 టీఎంసీలు తగ్గించాడు.. నిధులు ఇవ్వలేక ప్రాజెక్టును కూడా ఆపేసి కరువు రైతులకు తీరని ద్రోహం చేశాడని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మాజీ సీఎం చంద్రబాబు ఘాటుగా స్పందించారు. ప్రజాగళం యాత్రలో భాగంగా శుక్రవారం ఆలూరు అంబేడ్కర్ సర్కిల్‌లో జరిగిన రోడ్‌షోలో చంద్రబాబు మాట్లాడారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బి.వీరభద్రగౌడు, కర్నూలు ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజుతో కలిసి చంద్రబాబు రోడ్‌షోలో మాట్లాడారు. ప్రజాగళం యాత్ర సభకు జనం పోటెత్తారు. ఎల్లార్తి రోడ్డు, ఆదోని రోడ్డు, బళ్లారి రోడ్డు ఎటు చూసినా జనం.. జనం ప్రభంజనమే. ఉప్పొంగిన ఉత్సాహంతో సైకో పోవాలి.. సైకిల్ రావాలనే పాటకు తెలుగు యువత కార్యకర్తలు చిందులు వేశారు. బాబు ప్రశ్నలకు జగన్ గుండెల్లో దడ పుట్టేలా ప్రజలు సమాధానం ఇచ్చారు. ఈ దుర్మార్గుడు మాకొద్దు.. రాక్షస పాలన అంతం చేద్దాం.. సైకిల్‌ను గెలిపిస్తామంటూ ప్రజలు బాబుకు సూచించారు. కార్యకర్తల ఉత్సాహాన్ని చూసి చంద్రబాబు రెట్టింపు ఉత్సాహంతో ప్రసంగాన్ని కొనసాగించారు. రాబోయే ఎన్డీయే సారథ్యంలోని ప్రజా ప్రభుత్వంలో ఆలూరు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామంటూ వరాల జల్లులు కురిపించారు. 8 టీఎంసీలతో వేదవతి ప్రాజెక్టు పూర్తి చేసే బాధ్యత తీసుకుంటా.. నదిలో నీరు లేకపోతే హంద్రీనీవా కాలువ ద్వారా నీళ్లు నింపి కరువు నేలకు మళ్లిస్తా. టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తాం. ఆదోనిలో మిరప ప్రత్యేక మార్కెట్ ఏర్పాటు, డిగ్రీ కళాశాలకు ప్రత్యేక భవనాలు నిర్మాణం. జాతీయ రహదారితోపాటు ఆలూరు, హొళగుంద రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. బుడగజంగాలకు ఎస్టీ సర్టిఫికెట్లు ఇప్పిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు.



రోడ్‌షోలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వీరభద్ర గౌడ్, నాగరాజుతో చంద్రబాబు

సీమకు జగన్ ద్రోహం

రాయలసీమలో గత ఎన్నికల్లో 49 సీట్లు ద్వారా వైసీపీని గెలిపిస్తే.. ముఖ్యమంత్రి అయ్యాక జగన్ సీమకు తీరని ద్రోహం చేశారని చంద్రబాబు అన్నారు. ఒక్క డీఎస్సీ ఇవ్వలేదు.. ఒక్క ఉద్యోగం ఇవ్వలేదు.. ఆయన ఇచ్చిన వలంటీర్ల ఉద్యోగాల వల్ల యువత బాగు పడ్డారా అంటూ ప్రశ్నించారు. పేదల ఆదాయం పెరిగిందా.. గిట్టుబాటు ధర వచ్చిందా అంటూ నిలదీశారు. ఒక్క టీచర్ పోస్టయినా ఇచ్చాడా అంటూ ప్రశ్నించారు. విద్యపైన పెట్టిన ఖర్చు ఎంత.. మీరు దోచింది ఎంతో లెక్కలు చెప్పాలి అంటూ జగన్‌ను నిలదీశారు. కర్నూలు జిల్లాలో రూ.650 కోట్లతో మెగా సీడ్ పార్కును తీసుకువచ్చాను. రూ.350 కోట్లతో జైన్ ఇరిగేషన్ ప్రాజెక్టును తెచ్చా. రూ.90 కోట్లతో విమానాశ్రయాన్ని నిర్మించాను. ఎమ్మిగనూరులో వంద ఎకరాల్లో టెక్స్‌టైల్ పార్కుకు శ్రీకారం చుట్టాను. ముచ్చుమర్రి లిఫ్టు, గురు రాఘవేంద్ర ప్రాజెక్టు, ఆర్డీఎస్, వేదవతి ప్రాజెక్టులు తీసుకువచ్చాను. గాలేరు నగరి పూర్తి చేసి గండికోటకు నీరు మళ్లించి పులివెందులకు నీరు ఇచ్చాను. ఇది తెలుగుదేశం సాధించిన విజయాలు. జగన్ చేసిందేమిటో ఒక్కటైనా చెప్పగలడా అంటూ నిలదీశారు. చివరకు రోజంతా శ్రమ పడి సాయంత్రం ఓ క్వాటర్ మద్యం తాగుదామనే మద్యం ప్రియులను సైతం ముంచేశాడు. నాడు రూ.60 ఉన్న క్వాటర్ మద్యం.. ఇప్పుడు రూ.260కు చేరింది. మళ్లీ ఆయన అధికారంలోకి వస్తే.. రూ.500 అవుతుంది.. మద్యం డబ్బు అంతా ఎక్కడకు వెళ్తుందంటూ నిలదీశాడు. ప్రత్యేక హోదా తెస్తానంటూ మాట తప్పాడు. మద్యనిషేధం అని నిలువునా ముంచేశాడు.. సీపీఎస్ రద్దు అంటూ ఉద్యోగులను మోసం చేశాడు. ఇలాంటి మాట తప్పిన దుర్మార్గుడికి ఓటు వేస్తారా అని ప్రశ్నిస్తే.. వేయం.. వేయం అని గట్టిగా ప్రజలు కేకలు వేశారు.

శ్రమించే వారిని ఆదుకుంటా

ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం అహర్నిశలు శ్రమించిన టీడీపీ కార్యకర్తలు, నాయకులను ఆదుకునే బాధ్యత నాది అని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆలూరు నియోజకవర్గంలో వైకుంఠం కుటుంబం టీడీపీకి అండగా ఉంది. దివంగత వైకుంఠం శ్రీరాములు టీడీపీ బాగు కోసం పని చేశారు. కొందరు స్వార్థపరులు పార్టీని వీడినా.. వైకుంఠం జ్యోతి, వైకుంఠం ప్రసాద్‌లు టీడీపీ కోసం అండగా నిలిచారు. కప్పట్రాళ్ల బొజ్జమ్మ కుటుంబం టీడీపీకి దన్నుగా నిలుస్తుంది. గత ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీ చేసిన కోట్ల సుజాతమ్మ అనివార్య కారణాల వల్ల ఆమె త్యాగం చేయాల్సి వచ్చింది. కోట్ల, వైకుంఠం, కప్పట్రాళ్ల కుటుంబాలకు టీడీపీ అండగా ఉంటుంది. మీ రాజకీయ భవిష్యత్తు నాది. ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు వీరభద్రగౌడు, బస్తిపాటి నాగరాజులను గెలిపించే బాధ్యత మీరు తీసుకోవాలని చంద్రబాబు సూచించారు. గతంలో ఎన్నోసార్లు ఆలూరు వచ్చాను. ఇంతటి ఆదరణ ఇప్పుడే చూస్తున్నా. ఆలూరు నుంచి ఒక సామాన్య కార్యకర్త లింగాయతి సా మాజికవర్గానికి చెందిన వీరభద్ర గౌడుకు టికెట్ ఇచ్చాను. కురువ సామాజిక వర్గానికి చెందిన పంచలింగాల నాగరాజును కర్నూలు నుంచి ఢిల్లీకి పంపించేందుకు ఎంపీ టికెట్ ఇచ్చాను. ఆయన సామాన్య కుటుంబానికి చెందిన ఎంపీటీసీ. వీరిద్దరిని గెలిపించే బాధ్యత కార్యకర్తలు తీసుకోవాలని పిలుపు నిచ్చారు.

టీడీపీతోనే సామాజిక న్యాయం

టీడీపీతోనే సామాజిక న్యాయం సాధ్యమని చంద్ర బాబు అన్నారు. కర్నూలు పార్లమెం టులో వాల్మీకి వర్గానికి చెందిన రాఘ వేంద్రరెడ్డికి మంత్రాలయంలో, పార్థసారధికి ఆదోనిలో టికెట్ ఇచ్చాం. పత్తికొండలో ఈడిగ సామాజిక వర్గానికి చెందిన కేఈ శ్యాంబాబు, ఆలూరులో లింగాయతికి సామాజిక వర్గానికి చెందిన వీరభద్రగౌడు, కోడుమూరులో మాదిగ సామాజిక వర్గానికి చెందిన బొగ్గుల దస్తగిరి, కర్నూలులో ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన టీజీ భరత్‌కు టికెట్లు ఇచ్చాం. కర్నూలు ఎంపీగా కురువ సామాజిక వర్గానికి చెందిన పంచలింగాల నాగరాజును బరిలో దింపాం. ఎమ్మిగనూరులో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన జయనాగేశ్వరరెడ్డికి టికెట్ ఇచ్చాం. ఇది కదా సామాజిక న్యాయం అంటే. జగన్ చెప్పగలడా అంటూ ప్రశ్నించారు. సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, కర్నూలు ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు, ఆలూరు అభ్యర్థి వీరభద్రగౌడు, కర్నూలు ఎంపీ సంజీవకుమార్, ఆదోని ఇన్‌చార్జి కె.మీనాక్షి నాయుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడుతోపాటు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బస్తిపాటి నాగరాజు



యువకుడి ఉత్సాహం



భారీగా తరలి వచ్చిన జనాలు

చంద్రబాబును కలిసిన మీనాక్షినాయుడు

ఆదోని, ఏప్రిల్ 19: ఆలూరు నియోజకవర్గంలో ప్రజాగళం ఎన్నికల ప్రచారంలో భాగంగా వచ్చిన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, ఆయన కుటుంబ సభ్యులు కలిశారు. ఎమ్మెల్యే టికెట్ ఆశించి కూటమిలో భాగంగా బీజేపీకి కేటాయించడంతో అసంతృప్తికి లోనైన మీనాక్షి నాయుడిని చంద్రబాబునాయుడు బుజ్జగించారు. పార్టీ పుట్టినప్పటి నుండి ఉన్న మీనాక్షినాయుడును గుర్తిస్తున్నామని, సమయం వచ్చినప్పుడు ఆయన ఆశించినదానికన్నా మంచి చేయాలని తనకు ఉందని తెలిపినట్లు సమాచారం. టీడీపీ కార్యక్రమం సక్సెస్ చేయాలని మీనాక్షినాయుడుకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినా అది రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహిస్తారని, అలాంటి వ్యక్తికి పొత్తు వల్ల టికెట్ ఇవ్వలేకపోవడం బాధగా ఉందని చంద్రబాబు అన్నట్లు తెలిసింది. ఏదేమైనా మీనాక్షినాయుడును గుర్తు పెట్టుకున్నామని, ఎన్నికల్లో కలిసి మెలిసి పనిచేసి పార్థసారథిని గెలిపించాలని ఆయన సూచించినట్లు తెలిసింది. చంద్రబాబును కలిసిన వారిలో మీనాక్షినాయుడు కుటుంబసభ్యులు.. సీనియర్ నాయకులైన ఉమాపతినాయుడు, వెంకట్రామినాయుడు, రంగస్వామి నాయుడు, యువ నాయకులు మారుతి నాయుడు, తెలుగు యూత్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి ఉన్నారు.



ఆలూరులో చంద్రబాబును కలిసిన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మీనాక్షినాయుడు, కుటుంబ సభ్యులు

అప్పుల బాధతో

రైతు ఆత్మహత్య

బైచిగేరిలో విషాదం

ఆదోని రూరల్, ఏప్రిల్ 19 : అప్పుల బాధ తాళలేక ఆదోనిలో ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. మండలంలోని బైచిగేరికి చెందిన వడ్డె రామాంజి (47) అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. రామాంజికి ఎకరా పొలం ఉంది. భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ పోషణ నిమిత్తం 20 సంవత్సరాలుగా గ్రామానికి చెందిన రైతుల వద్ద పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఈ క్రమంలో పంటల సాగు కోసం రూ.5లక్షలకు పైగా అప్పులు చేశాడు. వాతావరణ పరిస్థితుల కారణంగా పంట చేతికందలేదు. దీనికి తోడు రుణదాతల నుంచి ఒత్తిళ్లు అధికం అయ్యాయి. ఈ ఒత్తిడిని తట్టుకోలేకపోయిన రామాజి ఆత్మహత్య చేసుకోవాలని భావించాడు. గురువారం అర్ధరాత్రి దాటాక పంటలకు వినియోగించే క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఉరుకుందమ్మ ఫిర్యాదు మేరకు ఆదోని తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

సాయిప్రసాద్‌రెడ్డి కబ్జాకోరు

- ఇలాంటి వ్యక్తికి ఓటేస్తారా?
- ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



ఆలూరు బహిరంగ సభలో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

ఆలూరు/ ఎమ్మిగనూరు/ఆదోని, ఏప్రిల్ 19: ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి ఓ పేకాటరాయుడు, కబ్జాకోరు అని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆరోపించారు. శుక్రవారం ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు పట్టణాల్లో ఆమె 'ఏపీ న్యాయయాత్ర' నిర్వహించారు. ఆలూరులోని అంబేడ్కర్ సర్కిల్, ఆదోనిలోని శ్రీనివాస భవన్ కూడలి, ఎమ్మిగనూరు పట్టణాల్లో నిర్వహించిన రోడ్‌షోలో ఆమె ప్రసంగించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి మీద విరుచుకపడ్డారు. ఆయన కబ్జాకోరు అని అంటూ ఏదైనా స్థలం కోటి విలువ చేస్తే, ఆయన ఇంట్లోనే రిజిస్ట్రేషన్ చేయించుకుంటారట కదా..? అని ప్రజలను అడిగారు. ఇలాంటి దోపిడీదారుకు మీరు ఓటు వేస్తారా? అని అడిగారు. ఎమ్మెల్యే ఇక్కడి పత్తి రైతులకు కనీస గిట్టుబాటు ధర లేకుండా చేశారని ఆరోపించారు. వైఎస్సార్ ప్రభుత్వంలో పత్తి క్వింటం రూ.12వేలు పలికేదని, ఇప్పుడు రూ.6వేలు కూడా పలకడం లేదని అన్నారు. స్థానికంగా ఉన్న స్పిన్నింగ్ మిల్లులు మూతపడి వేల మంది ఉపాధి కోల్పోయి వీధిన పడినా ఎమ్మెల్యే పట్టించుకోలేదని, వాటిని తెరిచే ప్రయత్నం లేదని విమర్శించారు. అంతకు ముందు ఆప్ స్థానిక నాయకులు కాశీంనాయుడు షర్మిలను కలిసి పూలగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు బాబురావు, ఎంపీ అభ్యర్థి రాంపుల్లయ్య యాదవ్, డీసీసీ కార్యదర్శి కాశింవలి, నీలకంఠప్ప, సీపీఐ, సీపీఎం నాయకులు భూపేష్, నారాయణ, రంగన్న, రాముడు పాల్గొన్నారు.

అభ్యర్థులను ఖరారు చేసిన వైఎస్ షర్మిల

ఆదోని అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థిగా వంశీ చైతన్య ఆసుపత్రి అధినేత రమేష్ యాదవ్, ఆలూరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నవీన్ కిషోర్‌లను షర్మిల ప్రకటించారు. ఎంపీ అభ్యర్థిగా రాంపుల్లయ్య యాదవ్‌ను ఆమె గతంలోనే ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఎమ్మిగనూరులో పర్యటించిన షర్మిల మాత్రం అక్కడ అభ్యర్థిని ప్రకటించలేదు.



ఎమ్మిగనూరులో..

రెండో రోజు 21 నామినేషన్లు..

కర్నూలు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక సమరానికి పలువురు అభ్యర్థులు సై అంటున్నారు. పోరులో మేము సైతమంటూ ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులు కూడా నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. రెండో రోజు శుక్రవారం కర్నూలు పార్లమెంటు స్థానానికి స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ వేశారు. పత్తికొండ నియోజకవర్గం నుంచి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు నామినేషన్ దాఖలు చేశారు. అనుచరులు, కార్యకర్తలు, టీడీపీ శ్రేణులతో కలిసి ఆర్వో కార్యాలయానికి చేరుకున్నారు. ఆర్వో, ఆర్డీవో రామలక్ష్మికి నామినేషన్ పత్రాలను అందజేశారు. వైసీపీ అభ్యర్థి కంగాటి శ్రీదేవి, రామ్మోహన్ రెడ్డిలు కూడా నామినేషన్ పత్రాలు అందజేశారు. ఆదోని నియోజకవర్గం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి పార్థసారథిరెడ్డి నామినేషన్ వేశారు. నామినేషన్ పత్రాలను సబ్ కలెక్టర్, ఆర్వో శివ్‌నారాయణ్ శర్మకు అందజేశారు. ఆయన వెంట టీడీపీ ఇన్‌చార్జి మీనాక్షినాయుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఉమ్మి సలీం, బీజేపీ కన్వీనర్ శ్రీరాములు ఉన్నారు. పాణ్యం నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థి గౌరు చరిత తరుపున మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి నామినేసన్ పత్రాలను ఆర్వో, జేసీ నారపురెడ్డి మౌర్యకు అందజేశారు. మల్లెపురాజు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. మంత్రాలయం నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థులు గుడిసె రామాంజనేయులు, చక్కెర పరమేష్‌లు నామినేషన్లు వేశారు. కర్నూలు నియోజకవర్గం నుంచి ఆరుగురు, కోడుమూరు నియోజకవర్గం నుంచి ముగ్గురు నామినేషన్లు దాఖలు చేశారు. ఎమ్మిగనూరు నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి మురహరిరెడ్డి, ఆలూరు నుంచి వైసీపీ అభ్యర్థి విరుపాక్షి, పత్తికొండ నుంచి ఇండియా కూటమి సీపీఐ అభ్యర్థి రామచంద్రయ్యలు తమ నామినేషన్ పత్రాలను సంబంధిత ఆర్వోలకు అందజేశారు. రెండో రోజు 21 నామినేషన్లు రాగా, రెండు రోజుల్లో 36 మంది ప్రధాన పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు సంబంధిత ఆర్వోలకు నామినేషన్ పత్రాలు అందజేశారు.



పత్తికొండలో నామినేషన్ దాఖలు చేస్తున్న టీడీపీ అభ్యర్థి శ్యాంబాబు



కర్నూలు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి):

త్యాగాల పురిటిగడ్డ కందనవోలు. ప్రాంత ప్రయోజనాల కంటే ఆంధ్రప్రదేశ్ విశాల ప్రయోజనాలకు ఎనలేని ప్రాధాన్యత ఇస్తూ ఆనాడు రాజధాని త్యాగం చేయాల్సి వచ్చింది. బ్రిటీష్ పాలనలో 1947 ఆగస్టు 15 తర్వాత దేశ స్వాతంత్ర్యం తర్వాత కూడా రాయలసీమ, కోస్తాంధ్ర జిల్లాలు మద్రాసు ప్రెసిడెన్సీ పరిధిలోనే ఉన్నాయి. ఆ ప్రెసిడెన్సీలో జనాభా, భూ విస్తీర్ణంలో తెలుగు మాట్లాడే సీమాంధ్ర ప్రాంతమే అధికంగా ఉన్నా.. పాలన, ఆర్థిక వ్యవస్థల్లో తమిళీయుల ఆధిపత్యం అధికంగా ఉండేది. ఫలితంగా ఆంధ్రుల్లో భద్రతా భావం పెరిగి తమకంటూ ఓ ప్రత్యేక రాష్ట్రం ఉంటే రాజకీయంగా, ఆర్థికంగా గుర్తింపు లభిస్తుందనే భావన కలిగింది. తెలుగు మాట్లాడే వారంతా ఒక రాష్ట్రంగా ఏర్పడాలనే కోరిక.. ఆలోచన బలపడి అది ఆంధ్రోద్యమానికి నాంది అయింది. సాతంత్ర్యానికి ముందే ఉద్యమానికి బీజం పడింది. 1953 అక్టోబరు 1న కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఆవిర్భవించినా మూడేళ్లలో విశాలాంధ్ర కోసం రాజధాని త్యాగం చేయక తప్పలేదు.

మూడేళ్ల ముచ్చటే..!



ఆంధ్ర రాష్ట్ర రాజధానిగా కర్నూలు

- ఆ ఆనందం మూడేళ్లకే ఆవిరి
- ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావంతో రాజధాని త్యాగం
- రాష్ట్ర విభజన తర్వాత తెరపైకి శ్రీబాగ్ ఒడంబడిక

శ్రీబాగ్ ఒడంబడిక

మదనపల్లెలో 1937లో పట్టాభి సీతారామయ్య అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ప్రత్యేకాంధ్ర నిర్మాణంపై ఒక తీర్మాణాన్ని ప్రవేశపెట్టారు. రాయలసీమకు చెందిన పాపన్న గుప్త దీన్ని వ్యతిరేకించారు. మద్రాసు మంత్రివర్గంలో సీమకు సరైన ప్రాతినిధ్యం, తుంగభద్ర ప్రాజెక్టు నిర్మాణం, రాజధాని, విశ్వవిద్యాలయంలో సీమకు ఉపయోగం, సమన్యాయం.. వీటిని తేల్చనిదే ప్రత్యేక రాష్ట్ర ఆలోచన అవివేకం అంటూ రాయలసీమ ప్రయోజనాలు గట్టిగా వినిపించారు. పాపన్నగుప్త అభిప్రాయాన్ని పట్టాభి ఏకీభవించారు. రాయలసీమ నాయకుల అపోహలకు, అనుమానాలకు తెరదించుతూ 1937 నవంబరు 16న చారిత్రాత్మకమైన శ్రీబాగ్ ఒడంబడిక కుదిరింది. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడితే రాయలసీమకు ఎలాంటి ప్రత్యేకతలు ఉండాలనేదే ఒడంబడిక ముఖ్య సారాంశం.

అమరజీవి త్యాగ ఫలితం

గాంధేయవాది పొట్టి శ్రీరాములు ప్రత్యేకాంధ్ర సాధన కోసం 1952 అక్టోబరు 19న ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్నారు. ఈ దీక్షతో ఆంధ్ర అంతటా ఉద్యమ జ్వాల రగిలింది. అయినా.. ఆనాటి కేంద్ర ప్రభుత్వంలో చలనం రాలేదు. 58 రోజులుగా అకుంఠిత దీక్ష సాగిస్తున్న పొట్టి శ్రీరాములు 1952 డిసెంబరు 15న అమరజీవి అయ్యారు. ఆంధ్రుల్లో ఆగ్రహజ్వాల రగిలి ఆందోళన హింసాత్మక ఉద్యమానికి దారి తీసింది. దిగివచ్చిన కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేస్తున్నట్లు నాటి ప్రధాని నెహ్రూ 1952 డిసెంబరు 19న లోక్‌సభలో ప్రకటించారు.

ఎస్‌కే ధార్ కమిషన్

1948 జూన్ 17న భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు అధ్యాయనం కోసం కేంద్ర ప్రభుత్వం ఎస్‌కే ధార్ కమిషన్ ఏర్పాటు చేసింది. 1948 డిసెంబరు 10న భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు సరైనది కాదంటూ ఆ కమిషన్ నివేదిక ఇచ్చింది. ఆంధ్రుల్లో ఆందోళన ఉప్పొంగింది. ఆంధ్రులను బుజ్జగిస్తూ ప్రధాని నెహ్రూ పటేల్, భోగరాజు, పట్టాభి సీతారామయ్యలతో ఏర్పాటు చేసిన అనధికార సంఘాన్ని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కొన్నేళ్లు వాయిదా వేయాలని.. ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయాలని.. మద్రాసును ఆంధ్రులు వదులుకోవాలని 1949 ఏప్రిల్ 1న నివేదిక ఇచ్చింది. ఆనాటి మద్రాసు ముఖ్యమంత్రి కుమారస్వామి రాజా నాయకత్వంలో టంగుటూరి ప్రకాశం పంతులు, బెజవాడ గోపాల్ రెడ్డి, కళా వెంకట్రావు, నీలం సంజీవరెడ్డిలతో విభజన సంఘం ఏర్పాటు చేశారు. సభ్యుల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. ప్రముఖ గాంధేయవాది స్వామి సీతారాం (గొల్లపూడి సీతారామశాస్త్రి) ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. 35 రోజుల తర్వాత 1951 సెప్టెంబరు 20న



ఆచార్య వినోభా భావే అభ్యర్థన మేరకు దీక్ష విరమించారు.



కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం

కర్నూలు రాజధానిగా 1953 అక్టోబరు 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. ఉత్తరాంధ్రకు చెందిన శ్రీకాకుళం, విశాఖపట్నం, కోస్తాంధ్రలోని తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, నెల్లూరు జిల్లాలు, రాయలసీమకు చెందిన చిత్తూరు, కడప, అనంతపురం, కర్నూలు జిల్లాలతో పాటు బళ్లారి జిల్లాలోని రాయదుర్గం, ఆదోని, ఆలూరు తాలుకాలను కలుపుతూ ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. అయితే.. ఎల్ఎస్ మిశ్రా కమిషన్ నివేదిక మేరకు బళ్లారి జిల్లా మైసూరు రాష్ట్రంలో కలిపారు. 1937 నాటి శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం కొత్తగా ఏర్పడిన ఆంధ్ర రాష్ట్రానికి కర్నూలు నగరం రాజధానిగా ప్రకటించారు. గుంటూరులో హైకోర్టు ఏర్పాటు చేశారు. టంగుటూరి ప్రకాశం పంతులు ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర గవర్నర్‌గా చందులాల్ మాధవ్‌లా త్రివేది (సీఎం త్రివేది)ని కేంద్రం నియమించింది. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయాలనే ఆంధ్రుల స్వప్నం సాకారమైంది.

కర్నూలు రాజధానిగా ఏర్పడిన ఆంధ్ర రాష్ట్రం వివరాలు:

ఆంధ్ర రాష్ట్ర అవతరణ	: 1953 అక్టోబరు 1
రాజధాని నగరం	: కర్నూలు
పెద్ద నగరం	: విశాఖపట్నం
జిల్లాలో	: 11
తొలి ముఖ్యమంత్రి	: టంగుటూరి ప్రకాశం పంతులు
గవర్నరు	: చందులాల్ మాధవ్‌లా త్రివేది (సీఎం త్రివేది)

మూడేళ్ల రాజధాని:

కందనవోలు ప్రజలకు రాజధాని వచ్చింది అనే ఆనందం.. సంతోషం ఎన్నో రోజులు నిలవలేదు. ఆ సంతోషం మూడేళ్లకే ఆవిరయింది. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటులో భాగంగా ఆంధ్ర రాష్ట్రం, ఆనాటి హైదరాబాద్ రాష్ట్రంలో తెలుగు మాట్లాడే తెలంగాణ ప్రాంతాన్ని కలిపి 1956 నవంబరు 1న విశాలాంధ్రగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది. కర్నూలు ప్రజల త్యాగాల ఫలితంగా రాజధాని హైదరాబాద్‌కు మారింది. 58 ఏళ్ల తర్వాత ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం-2014 ద్వారా 2014 జూన్ 2న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను రెండు ముక్కలు చేశారు. 13 జిల్లాలో ఆంధ్రప్రదేశ్ (నవ్యాంధ్ర) ఏర్పాటుతో ఆనాడు విశాలాంధ్ర దృక్పథం కోసం కర్నూలులో రాజధాని లేదా హైకోర్టు ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో 1937 నాటి శ్రీబాగ్ ఒడంబడిక అంశం మళ్లీ తెరపైకి వచ్చింది.


మూడేళ్ల పాలన వివరాలు:

- టంగుటూరి ప్రకాశం పంతులు 1953 అక్టోబరు 1 నుంచి 1954 నవంబరు 15 వరకు (13 నెలల 15 రోజులు).
- 1954 నవంబరు 15 నుంచి 1955 మార్చి 28 వరకు రాష్ట్రపతి పాలన (4 నెలల 13 రోజులు)
- బెజవాడ గోపాల్ రెడ్డి 1955 మార్చి 28 నుంచి 1956 నవంబరు 1 వరకు (7 నెలల 3 రోజులు)
- **హైకోర్టు** : గుంటూరు
- **జిల్లాలు** : కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు, నెల్లూరు, కృష్ణా, గుంటూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, విశాఖపట్నం, శ్రీకాకుళం. (ఆ తరువాత ప్రకాశం, విజయనగరం జిల్లాలు ఏర్పడ్డాయి)

ప్రత్యేక రాష్ట్ర ప్రతిపాదనకు బీజం

1912 మే నెలలో నిడదవోలులో జరిగిన సదస్సులో ప్రత్యేక రాష్ట్ర ప్రతిపాదన తెరపైకి వచ్చింది. 1913 మే 20న బయ్యా నరసింహేశ్వరశర్మ అధ్యక్షతన జరిగిన ఆంధ్ర మహాసభలో ప్రత్యేకాంధ్ర ఏర్పాటుపై విస్తృత చర్చ జరిగింది. రాయలసీమ, విశాఖ ప్రాంత ప్రతినిధులు సుముఖత చూపలేదు. ప్రచార అంశాన్ని ఒక స్థాయి సంఘానికి అప్పగించాలని కొండా వెంకటప్పయ్య చేసిన సవరణతో ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సాధన కోసం తీర్మానం చేశారు. పట్టాభి సీతారామయ్య విస్తృతంగా పర్యటించి ఆంధ్రోద్యమానికి ప్రజాభిప్రాయం కూడగట్టారు. 1914లో విజయవాడలో రెండో మహాసభ జరిగింది. కాకినాడలో జరిగిన 4వ ఆంధ్ర మహాసభలో భోగరాజు పట్టాభి సీతారామయ్య, కొండా వెంకటప్పయ్య వంటి మేధావులు భారత రాష్ట్రాల పునర్నిర్మాణం పేరిట ఒక కరపత్రాన్ని తయారు చేసి దేశ వ్యాప్తంగా పంచారు. అదే ఏడాదిలో మద్రాసులో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్‌లో చర్చకు వచ్చింది. 1918 జనవరి 22న ఆంధ్రకు జాతీయ కాంగ్రెస్ ప్రత్యేక విభాగం ఏర్పాటుతో ఆంధ్ర రాష్ట్ర పోరుకు అడుగులు వేగంగా పడ్డాయి.

జిల్లా కోర్టు



మునుపటి సెక్రటేరియట్ కార్యాలయం (ప్రస్తుతం మెడికల్ కాలేజీ ల్యాబ్)



డబ్బులిస్తేనే ప్రచారం

పైసామే పరమాత్మ



ఆదోని, ఏప్రిల్ 19: పైసలిస్తేనే జనాలు ప్రచారానికి వస్తున్నారు. లేదంటే ముఖం చాటేస్తున్నారు. ఒక్కో నియోజకవర్గంలో ఒకటి నుంచి 6 మండలాలు వరకు ఉన్నాయి. ఒక్కో మండలంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు, పార్టీ మండల అధ్యక్షులు, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు కలిపి వంద మందికి పైగానే ఉంటారు. వీరంతా ప్రచారంలో చురుగ్గా పాల్గొంటేనే అభ్యర్థి గెలిచే అవకాశాలు ఉంటాయి. ఒక్కో నియోజకవర్గంలో ప్రచారానికి రూ.10 కోట్ల దాకా అవసరం అవుతాయని అభ్యర్థులు అంచనా వేస్తున్నారు. వేసవి కాలం కావడంతో ఏసీ వాహనాలు, మజ్జిగ, భోజనాలు, మంచి నీరు, బిర్యానీలు, ప్రచార పత్రాలు, మద్యం, ఫ్లెక్సీలు ఇలా అన్నింటికీ భారీగా డబ్బు అవసరం అవుతోంది. ఏదైనా చిన్న గ్రామంలో ప్రచారానికి వెళ్లాలన్నా ఖర్చులకు ఇవ్వాలని కార్యకర్తలు, అక్కడి చోటామోటా నాయకులు అడుగుతున్నారు. ఒక్కో కార్యకర్త రోజుకు రూ.1000 దాకా అడుగుతున్నారని చెబుతున్నారు. ఇందుకు భోజనం, మద్యం అదనం. మండల స్థాయి నేతలకు రూ.లక్షల్లో చెలిస్తేనే ప్రచారానికి ముందుకు వస్తున్నారు. ఇవి కాకుండా స్థానికులకు అవసరమైన కొన్ని పనులు కూడా చేసి పెట్టాల్సి వస్తోంది. అడిగినంత ఇచ్చి ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు తంటాలు పడుతున్నారు. అప్పులు చేసి, ఆస్తులు తాకట్టు పెట్టి మరీ ఎన్నికల్లో భారీగా డబ్బును వ్యయం చేస్తున్నారు.

తనిఖీలు ముమ్మరం

కర్నూలు, ఏప్రిల్ 19: ఎన్నికల నేపథ్యంలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. జిల్లా వ్యాప్తంగా 13 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. వాహనాలను తనిఖీ చేసేందుకు ఆయా చెక్‌పోస్టుల వద్ద పోలీసులతోపాటు వివిధ విభాగాలకు చెందిన అధికారులు కూడా ఉంటారు. తనిఖీల ప్రక్రియ వీడియో ద్వారా చిత్రీకరిస్తారు. ఈ నేపథ్యంలో ఎంత నగదు తీసుకెళ్లాలి.. ఎంత బంగారం వెంట తీసుకెళ్లాలో ఓ సారి తెలుసుకుందాం.

- **రూ.50వేల వరకే:** ఎవరైనా సాధారణ పౌరుడు తన అవసరాల నిమిత్తం రూ.50వేల లోపు నగదును తన వెంట తీసుకెళ్లవచ్చు. ఆపై తీసుకెళ్లేవారు ఆ నగదుకు సంబంధించిన పత్రాలు వెంట ఉంచుకోవాలి. రూ.50వేల పైన పట్టుబడితే.. ఆ నగదును బ్యాంకు నుంచి డ్రా చేసినప్పటికీ ఏ ఉపయోగం కోసం తీసుకెళ్తున్నారో చూపించాలి. రూ.10 లక్షలపైన నగదు పట్టుబడితే.. ఎలాంటి పత్రాలు తీసుకెళ్లినా ఆ మొత్తాన్ని ఆదాయ పన్ను శాఖ అధికారులకు అప్పగిస్తారు. ఆదాయ పన్ను శాఖ అధికారుల వద్ద ఆ మొత్తానికి లెక్కలు చూపాలి. ఎన్నికల ప్రచారంలో పాల్గొనే ఎమ్మెల్యే అభ్యర్థులు, వారి అనుచరులు నగదు తీసుకెళ్లే పరిమితి రూ.10వేలు మాత్రమే. ఆపైన ఉంటే కేసు నమోదవుతుంది. (ఇలాంటి సందర్భాల్లో ఎన్నికల ప్రచారానికి సంబంధించిన కరపత్రాలు, ఇతరత్రా నామినేషన్ పత్రాలు వెంట ఉంటే మాత్రం ఎన్నికల ప్రచారం అభ్యర్థిగానే పరిగణిస్తారు)
- **బంగారు విషయంలో:** పెళ్లయిన యువతి 50 తులాలు, పెళ్లి కాని యువతి 20 తులాలు, వృద్ధులు పది తులాలు బంగారం మాత్రమే వెంట తీసుకెళ్లవచ్చు. బంగారానికి సంబంధించిన లెక్కలు కచ్చితంగా చూపాల్సిందే. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రలోభాలకు గురి చేసే చీరలు, ఇతరత్ర గిఫ్టు సామగ్రిని వెంట తీసుకెళ్లినా కేసు నమోదు చేస్తారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా రూ.232 కోట్ల నగదు సీజ్ చేశారు. 66.93 కిలోల వెండి, 4.23 కిలోల బంగారు ఆభరణాలు సీజ్ చేశారు. తనిఖీల్లో పట్టుబడిన బంగారు, నగదును వెంట వెంటనే రిలీజ్ చేసేందుకు గ్రీవెన్స్ కమిటీ ఆధ్వర్యంలో ఏరోజుకారోజు చర్యలు తీసుకుంటారు.

వలస కూలీలపై ఆరా


గోనెగండ్ల, ఏప్రిల్ 19: నామినేషన్ ఘట్టం గురువారం ప్రారంభమైంది. వివిధ గ్రామాలలో టీడీపీ, వైసీపీ నాయకులు ఎన్నికల ప్రచారం చేయడమే గాక తమ పార్టీ అధినాయకులతో కూడా తమ తమ నియోజకవర్గాల్లో ప్రచారం చేయిస్తున్నారు. గ్రామస్థాయి నాయకులు తమకు ఇష్టం ఉన్న పార్టీలో చేరుతున్నారు. గోనెగండ్ల మండలంలోని కొన్ని గ్రామాలలో వైసీపీ నాయకులు బతుకు దెరువు కోసం వలస వెళ్లిన కూలీల ఆరా తీస్తున్నారు. తమ గ్రామాల నుంచి ఎంత మంది కూలీలు వలస వెళ్లారు? ఏ ప్రాంతాలకు వెళ్లారు, ఎక్కడ ఉన్నారు. ఎప్పుడు వస్తారు? అక్కడ వారికి రోజుకు ఎంత కూలీ ఇస్తున్నారు? అని తమ అనుచరులతో చర్చలు జరిపి సమాచారం తెలుకుంటున్నారు. గోనెగండ్ల మండలంలో దాదాపు 85వేల జనాభా ఉంది. అందులో 57,992 మంది ఓటర్లు ఉన్నారు. ఇప్పటికే మండలం నుంచి దాదాపు 20వేల నుంచి 25వేల మంది వరకు హైదరాబాద్, గుంటూరు, రాయచూరు, రాజంపేట, రాజమండ్రి, గోవా తదితర ప్రాంతాలకు వలస వెళ్లారు. మండలంలోని బైలుప్పల, అగ్రహారం, గంజహళ్లి, నెరుడుప్పల, అలువాల, కులుమాల, గోనెగండ్ల, హెచ్ కైరవాడి, వేముగోడు, వీరంపల్లి, తిప్పనూరు, పుట్టపాశం పెద్దమరివీడు, చిన్నమరివీడు, పెద్దనేలటూరు, చిన్ననేలటూరు తదితర గ్రామాలతోపాటు మరిన్ని గ్రామాల నుంచి కూడా కూలీలు పెద్ద సంఖ్యలో వలస వెళ్లారు. వారు ఉగాది పండగకు వచ్చి మళ్లీ తాము పనులు చేసే ప్రాంతాలకే వలస వెళ్లారు. ఈ నెల చివరి పెళ్లి ముహూర్తాలు 25న ఉండటంతో కొందరు తమ బంధువుల పెళ్లిళ్లు పూర్తి చేసి వెళ్లాలని చూస్తున్నారు. అయితే వలస వెళ్లిన వారితో ఆయా గ్రామాల నాయకులు ఫోన్ మాట్లా డి విషయం తెలుసుకుంటున్నారు. పోలింగ్ రోజుకు రెండు రోజుల ముందు తప్పని సరిగా గ్రామానికి చర్యలు తీసుకుంటున్నారు. వైసీపీ నాయకులు పోలింగ్ రోజు చాలా రోజులు ఉన్నప్పటికీ పగడ్బందీ ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. నందవరంలో 46466 మంది ఓటర్లు ఉన్నారు. ఎమ్మిగనూరు టౌన్, మండలం కలసి 1,38679 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో నందవరం, ఎమ్మిగనూరు రూరల్ నుంచి ఎక్కువ మంది వలస వెళ్లినట్లు తెలుస్తోంది.



వలస ఓటర్లపై కన్ను
పోలింగ్ రోజు రప్పించేందుకు ఏర్పాట్లు

క్యా బాత్ హై..

సాయి ప్రసాద్ రెడ్డీ... నీ నాలుక కోస్తా..



ఎన్నికల ప్రచారంలో ఒకరిపై ఒకరు మాటల కత్తులు దూసుకుంటున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలపై ప్రతిపక్షాలతో పాటు అభ్యర్థులు సైతం తమదైన శైలిలో విరుచుకుపడుతున్నారు. ఈ క్రమంలో ఆదోని సిట్టింగ్ ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డిపై బీజేపీ అభ్యర్థి డాక్టర్ పార్థసారథి నిప్పులు చెరిగారు. 'ఏయ్ సాయి ప్రసాద్ రెడ్డీ.. రాజకీయంగా నన్ను ఎదుర్కోలేక కుటుంబం జోలికి వస్తే నాలుక కోస్తా.. జాగ్రత్తగా ఉండు..' అంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భూకబ్జా చేయడం, పేకాట, మట్కా ఆడిస్తున్నావ్.. దీనిపై నువ్ సమాధానం చెప్పు. రేషన్ బియ్యం అమ్ముకుంటున్న నీవా నాతో మాట్లాడేది. ఐదు పెళ్లిళ్లు చేసుకున్నానంటూ నాపై విమర్శలు చేస్తావా? నీకు చదువు లేదు. బుద్ధి లేదు. కుటుంబం జోలికొస్తే తాటతీస్తా.' అంటూ హెచ్చరించారు.

- ఆదోని

వైసీపీకి ఓటు వేస్తే డ్రైనేజీలో వేసినట్టే..!

చెల్లీ.. ఏంటీ లొల్లి



రాష్ట్ర ప్రజలు సీఎం జగన్‌పై విసుగెత్తిపోయారు. ఆ విసుగు ఆయన ఇంటి నుంచే మొదలైంది. సొంత చెల్లెలు వైఎస్ షర్మిల జగన్‌పై, ఆయన పార్టీపై ఎక్కడ పడితే అక్కడ ఎడాపెడా విమర్శలు చేస్తున్నారు. శుక్రవారం ఆలూరు రోడ్‌షోలో వైఎస్ షర్మిల మాట్లాడుతూ... 'వైసీపీకి ఓటు వేస్తే.. డ్రైనేజీలో వేసినట్టే' అన్నారు. మొత్తం మీద ఐదేళ్ల పాలనలో సీఎం జగన్ మన చేతికి చిప్ప ఇచ్చాడని విమర్శించారు.

- ఆలూరు

పోలింగ్ బూత్‌లో 1,400 ఓట్లే ఎందుకు..?

తెలుసుకుందాం..



ఒక్కో పోలింగ్ బూత్‌లో గరిష్ఠంగా 1,400 మంది ఓటర్లు ఉండే లా అధికారులు ఏర్పాట్లు చేస్తారు. ఇలా ఎందుకు చేస్తారో తెలుసా..? ప్రతి బూత్‌లో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాడ్‌లు ఈ మూడు ఒక దానికొకటి అనుసంధానంగా పని చేస్తాయి. ప్రస్తుతం వినియోగిస్తున్న ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)లకు అనుసంధానంగా ఉండే వీవీ ప్యాట్ (ఓటర్ వెరిఫైయబుల్ పేపర్ అండ్ ట్రయల్)లో కాగితాన్ని పొందుపరుస్తారు. అది 1450 స్లిప్పులను మాత్రమే ముద్రిస్తుంది. బ్యాటరీతో పని చేసే వీవీ ప్యాట్‌లోని డిస్‌ప్లేలో ఓటు ఎవరికి వేశామన్నది కనిపిస్తుంది. అందులో 50 వరకు కాగితం, స్లిప్పులు, ఓటింగ్ రోజు మాక్ పోలింగ్ ప్రక్రియకు వాడుతారు. అందుకే ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్ఠంగా 1400 ఓటర్లు మాత్రమే ఉండేలా చూస్తారు.

- కర్నూలు కలెక్టరేట్

మారెప్ప ఎక్కడప్పా...

ఉన్నా.. లేనట్టుగా..



ఆదోని, ఏప్రిల్ 19: ఆలూరు నియోజకవర్గంలో ఓసారి ఎమ్మెల్యే, ఓసారి ఉమ్మడి రాష్ట్రంలో కేబినెట్ మంత్రిగా పని చేసిన మూలింటి మారెప్ప నేడు రాజకీయాల్లో కనుమరుగై పోయారు. పంచాయతీ రాజ్‌లో ఇంజనీరింగ్‌గా ఉన్న మారెప్పను అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి పిలిచి ఆయనకు యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పదవి కేటాయించారు. 1999లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఆలూరు ఎమ్మెల్యేగా పోటీ చేయించి గెలిపించారు. రెండోసారి కూడా 2014 ఎన్నికల్లో పోటీ చేసిన మారెప్ప వైఎస్ రాజశేఖర్ రెడ్డి క్యాబినెట్ ఉమ్మడి రాష్ట్రాల్లో రాష్ట్ర ఎత్తిపోతలు, మార్కెటింగ్ శాఖ మంత్రిగా పని చేశారు. ఆలూరు నియోజకవర్గంలో ఐటీటీ, పాలిటెక్నిక్ కళాశాలలను ఆయన హయాంలోనే మంజూరయ్యాయి. ఆతర్వాత ఆలూరు అసెంబ్లీ స్థానం ఎస్సీ రిజర్వేషన్ నుంచి ఓసీ జనరల్‌గా మారడంతో మారెప్పకు అవకాశం లేకుండా పోవడంతో ఆయన నియోజక వర్గానికి దూరమయ్యారు. ఆ తరువాత వైసీపీలో చేరారు. కొంతకాలానికి బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. తిరిగి నాలుగు నెలల క్రితం కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. ఆలూరు నుంచి ఆయన ఉనికి పూర్తిగా తగ్గిపోయింది. బంధువులు మాత్రమే ఆస్పరి మండల రాజకీయాల్లో కీలకంగా ఉన్నారు.

ఆన్‌లైన్ వేదికపై ఎన్నికల సంగ్రామం

హీటెక్కుతున్న ఫోన్



కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 19: ఎన్నికల వేళ ఆన్‌లైన్ వేదికపై ఎన్నికల సంగ్రామం సాగుతున్నది. సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, ఎక్స్(ట్విటర్), యూట్యూబ్ వేదికగా అధికార, విపక్షాలు ఓటరును ప్రసన్నం చేసుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి. యువ ఓటర్ నాడిపట్టేందుకు ఎన్నికల బరిలో నిలిచిన ఆయా పార్టీల అభ్యర్థులు సామాజిక ప్రసార మాధ్యమాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల వేడి రోజురోజుకు పెరుగుతోంది. అధికార తెలుగుదేశం, వైసీపీ అభ్యర్థులు ఒకరిపై ఒకరు మాటల తూటాలను ఎక్కుపెడుతూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఆప్పటికే తెలుగుదేశం పార్టీ అభ్యర్థి టీజీ భరత్ ఫాలో అవర్లు, కార్యకర్తలు వాట్సాప్, ఫేస్ బుక్‌లో ఓ రేంజ్‌లో హంగామా చేస్తున్నారు. వైసీపీ అభ్యర్థిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నారు. వైసీపీ కూడా తెలుగుదేశం పార్టీతో దీటుగా హంగామా చేయడానికి ఆన్‌లైన్ వేదికలను ఉపయోగించుకుంటున్నది. ఈ సందర్భంలో తమ పార్టీల మేనిఫెస్టోలను అభ్యర్థులతో పాటు ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు సోషియల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తూ ఓటర్ల మనసును గెలుచుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఆన్‌లైన్ వేదికగా సవాళ్లు ప్రతి సవాళ్లతో తమ పోస్టుల ద్వారా ప్రచారాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్నారు.

బిర్యానీ, బీరు బాటిల్ ఇవ్వాల్సిందే..

ఐదేళ్ల పండగ మరి..!



ఆదోని, ఏప్రిల్ 19: సాయంత్రమైంది. ప్రచారం ముగిసింది.. రేపు చూస్కుందాం అంటే కుదరదు. రాత్రికి కూడా ఓ బిర్యానీ ప్యాకెట్ పంచాల్సిందే. కావాలంటే ఓ బీరు బాటిల్‌ను కూడా ఇవ్వాల్సిందే. లేదంటే రేపటి ప్రచారానికి కష్టమే. మొత్తంగా ఎన్నికలు ప్రచారానికి వెళ్లే వారి కడుపును నింపడంతోపాటు మద్యం మంచి కిక్కును ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికలు హోటళ్లకు మంచి గిరాకీ తెచ్చిపెడుతున్నాయి. తక్కువలో తక్కువ అనుకున్నా రోజుకు లక్ష రూపాయల ఆర్డర్స్ వస్తున్నాయి. లీడర్లు.. కొందరు బిర్యాని ఆర్డర్స్ చేస్తే.. కొందరు మాత్రం స్పెషల్ మెనూ, ఐదు రకాల వంటకాలు ఆర్డర్స్ ఇస్తూ ఎక్కడా తగ్గకుండా తమ గురించి గొప్పగా చెప్పుకునేలా నేతలు ఖర్చు పెడుతున్నారు.

పకడ్బందీగా అమలు చేయాలి



మాట్లాడుతున్న జయన్న

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 19: సమాచార హక్కు చట్టాన్ని అధికారులు పకడ్బందీగా అమలు చేయాలని సమాచార హక్కు పరిరక్షణ వేదిక రాష్ట్ర కార్యదర్శి జయన్న అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళ ఐక్యవేదిక అధ్యక్షురాలు మీసాల సుమలత ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మద్దిలేటి, రమణబాబు, నాగప్ప, శేషమ్మ, నారాయణమ్మ, శంకరమ్మ, రమప్రియ పాల్గొన్నారు.

22 నుంచి సుంకులా పరమేశ్వరి బ్రహ్మోత్సవాలు



గూడూరు, ఏప్రిల్ 19: మండలంలోని కె.నాగలాపురం లో సుంకులాపరమేశ్వరి బ్రహ్మోత్సవాలు ఈ నెల 22వ తేదీ నుంచి 24 వరకు జరుగుతాయని ఆలయ కార్యనిర్వహణాధికారి బీవీ నరసయ్య తెలిపారు. ఈనెల 22న 22వ గణపతి, పుణ్యాహవాచనం, కంకణధారణ, అంకురార్పణ, మండపారాధన, రాత్రి 8గం ప్రభోత్సవం నిర్వహిస్తామన్నారు. 23న సాయంత్రం రథోత్సవం, 24న లింగమన్న పూజా కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. అలాగే సాంస్కృతిక కార్యక్ర మాలను నిర్వహిస్తామన్నారు.

సంక్షేమ పథకాలు పునరుద్ధరిస్తాం

కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్



టీడీపీలో చేరిన వారితో టీజీ భరత్



భరోసా యాత్రలో టీజీ భరత్

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 19: తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు పునరుద్ధరిస్తామని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం టీజీ భరత్ కార్యాలయంలో నగరంలోని 11వ వార్డుకు చెందిన షాకిర్, రిజ్వానా, ముబీనా, షైముస్సీసాలు టీడీపీలో చేరారు. టీజీ భరత్ వారికి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం ఓట్లను కొల్లగొట్టేందుకు వైసీపీ నాయకులు తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ముస్లింల రిజర్వేషన్లు తీసివేయదని అన్నారు. పార్టీలో చేరిన వారిలో షాహిన్, హసీనా, షాజహాన్, షంషీన్, రేషమ, ఫర్హిన్, పిర్దోస్ ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు హైదర్ హుసేన్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి బంగారుపేట వాసులు: కర్నూలు నగరంలోని బంగారు పేటకు చెందిన యువకులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. శుక్రవారం టీజీ భరత్ కార్యాలయంలో మాజీ కార్పొటర్ ఎన్ఎస్ జెల్లీ, వినోద్, సచిన్ విజయ్ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం బంగారుపేటకు చెందిన మహిళలు భాగ్యశ్రీ శుభశ్రీ, నాగలక్ష్మి, సుల్తానా తదితరులు టీజీ భరత్‌ను కలిసి తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ బంగారుపేటలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి అర్షద్, టీడీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, సురేష్, శేఖర్, సత్యం గౌడ్, రేష్మ, ఏలియా, ఎల్లు, రవి, శ్రీనివాసులు, హరిష్‌గౌడ్, విజయ్, జాన్ , శేఖర్, మద్ది పాల్గొన్నారు.

● నగరంలోని నాలుగో వార్డులో టీడీపీ ఇన్‌చార్జి ఊట్ల రమేష్ శుక్రవారం ఇంటింటి ప్రచారం చేశారు. బూత్ ఇన్‌చార్జి సుజాతమ్మ, నాగరాజు, వసీం, నరసింహ, కమల, పద్మమాలిని, నాగేశ్వరమ్మ, సయ్యద్ బాషా పాల్గొన్నారు

ఆరోరా నగర్‌లో టీజీ భరత్ భరోసా యాత్ర

కర్నూలు(అర్బన్): నగరంలోని 22 వార్డులో ఆరోరానగర్‌లో కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ భరోసా యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి అర్షద్, టీడీపీ నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, వార్డు ఇన్‌చార్జి శ్రీధర్, నాయకులు మోయిన్ బాషా, సూర్యప్రకాష్, దీపక్, వనిత, వంశీ, విష్ణు, సాయి, చైతన్య, గీత, వనితకుమారి, రంగనాధ్, కళ్యాణ్, చంద్రశేఖర్, బాలు, ఈశ్వర్, మల్లికార్జున పాల్గొన్నారు.

టీడీపీలోకి నందికొట్కూరు ఎమ్మెల్యే సోదరుడు: నందికొట్కూరు ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ సోదరుడు రాజశేఖర్ టీడీపీలో చేరారు. శుక్రవారం నగరంలోని 48వ వార్డులో ఈయన తన అనుచరులకు టీజీ భరత్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా తోగూరు రాజశేఖర్ మాట్లాడుతూ టీడీపీతోనే అభివృద్ధి జరుగుతుందన్నా నమ్మకంతో పార్టీలో చేరినట్లు చెప్పారు. టీడీపీ నాయకులు దేవా, స్వామి రెడ్డి పాల్గొన్నారు.

గౌరు సమక్షంలో
టీడీపీలో చేరిక



టీడీపీ కండువా కప్పుతున్న గౌరు వెంకటరెడ్డి

కల్లూరు, ఏప్రిల్ 19: ఓర్వకల్లు మండలం కొమరోలు గ్రామానికి చెందిన రాయలసీమ విద్యార్థి పెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి రవీంద్రనాథ్ తన అనుచరులతో శుక్రవారం నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి గౌరు వెంకటరెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చక టీడీపీ లో చేరామన్నారు. పాణ్యం నియోజకవర్గంలో గౌరు చరిత గెలుపునకు కృషి చేస్తామన్నారు.

మాతృ మరణాలపై సమీక్ష



మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 19: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో జరిగిన నెలవారి మరణాలపై ఆసుపత్రి సూపరింటెండెంట్ వి.వెంకటరంగారెడ్డి సమీక్ష నిర్వహించారు. శుక్రవారం కర్నూలు మెడికల్ కాలేజీ న్యూలెక్చర్ హాల్‌లో గైనిక్ విభాగానికి సంబంధించిన కేసులపై ప్రజెంటేషన్ ద్వారా సమీక్ష చేసినట్లు సూపరింటెండెంట్ తెలిపారు. గత నెల గైనిక్ 6వ యూనిట్‌లో చనిపోయిన గద్వాల జిల్లాకు చెందిన సునీత మరణం గురించి సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఆసుపత్రిలో మరణించిన రోగి యొక్క వ్యాధి గల కారణాలు వ్యాధి నిర్ధారణకు సంబంధించిన వైద్య పరీక్షలు చికిత్స సక్రమంగా అందించాలని వైద్యులను ఆదేశించారు. ఈ సమీక్షలో వైస్ ప్రిన్సిపల్ హరిచరణ్, పీడియాట్రిక్ హెచ్‌వోడీ డా.విజయానం దబాబు, పీడియాట్రిక్ సర్జరీ హెచ్‌వోడీ డా.శివకుమార్, డా.సునీల్ కుమార్ రెడ్డి, సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, ఆర్ఎంవో వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్లు శివబాల, వైద్యులు, పీజీలు పాల్గొన్నారు.

ఓల్డ్ టౌన్ సెక్షన్‌లో నేడు విద్యుత్ కోత

కల్లూరు, ఏప్రిల్ 19: విద్యుత్‌లైన్ల మరమ్మతులో భాగంగా ఓల్డ్‌టౌన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ కోత ఉంటుందని కర్నూలు డివిజన్ ఆపరేషన్ ఈఈ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి ఒంటి గంట వరకు ఓల్డ్‌టౌన్ సెక్షన్‌లోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఏరియా, గీతామందిర్, దండెగేరి, ఉస్మానియా కాలేజీరోడ్ ప్రాంతాల్లో కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ప్రజలు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ముగిసిన శ్రీరామ నవమి ఉత్సవాలు

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 19: పాత నగరంలోని రాంబొట్ల ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు శుక్రవారం రాత్రి ముగిశాయి. సాయంత్రం సీతారామచంద్ర లక్ష్మణ ఉత్సవమూర్తులతో రథోత్సవం కన్ను ల పండువగా నిర్వహించారు. అనంతరం రథంపై స్వామి, అమ్మవార్లను ఆసీనింపజేసి భక్తుల మధ్య ఊరేగించారు. ఈ రథోత్సవాన్ని రాంబొట్ల ఆలయ చైర్‌పర్సన్ నగరూరు దీప్తి, నగరూరు శ్రీనివాసులు దంపతులు ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు, వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు, ధర్మ ప్రచార మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంసీఎంసీ కేంద్రం పరిశీలన

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 19: సాధారణ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లోని సీపీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ కేంద్రాన్ని ఎన్నికల వ్యయ పరిశీలకులు ఆర్ఆర్ఎన్ శుక్లా, రాకేష్ పరిశీలించారు. వీరు ఎంసీఎంసీ పని తీరు, ఎక్స్‌పెండీచర్‌ను బుక్ చేసే విధానం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎక్స్‌పెండీచర్ నోడల్ ఆఫీసర్ రమేష్‌బాబు, డీసీవో రామాంజనేయులు, మీడియా నోడల్ ఆఫీసర్ వెంకటలక్ష్మమ్మ, సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ జయమ్మ, లైజన్ ఆఫీసర్ పాల్గొన్నారు.

పరుగు పందెం విజేత నవీన్

కోడుమూరు(రూరల్), ఏప్రిల్ 19: మండలంలోని అమడగుంట్లలో సవారమ్మదేవి వేడుకల్ని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం టీడీపీ నాయకులు పరుగు పందెం పోటీలు నిర్వహించారు. స్థానిక బస్టాండు నుంచి చిల్లబండ వరకు వెళ్లివచ్చే పరుగుపందెంలో నవీన్‌యాదవ్ మొదటి విజేతగా నిలిచి రూ.15వేలు గెలుపొందాడు. రెండో స్థానంలో యల్లక్రిష్ణ రూ.10 వేలు, మూడో స్థానంలో బోయ సుధాకర్ రూ.5వేలు దక్కించుకున్నారు. విజేతలకు టీడీపీ నాయకులు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ లోక్‌సభ ఉపా ధ్యక్షుడు వెంకటేశ్వర్లు, బీసీ సెల్ నాయకుడు రాజు, తెలుగుయువత కార్యదర్శి మాదన్న, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ సుంకన్న, చెన్నారెడ్డి, ఎర్రగిడ్డయ్య, బోయ శ్రీనివాసులు, సుధాకర్‌రెడ్డి, నంద్యాల శ్రీనివాసులు పాల్గొన్నారు.

25 వరకు పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం: జేసీ

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 19: సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వర్తించేవారు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 25 వరకు అవకాశం ఉందని పాణ్యం నియోజకవర్గ ఆర్వో, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో సాధారణ ఎన్నికలు-2024 సంబంధించి వివిధ అంశాలపై విలేకరులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఎన్నికల్లో విధులు నిర్వర్తించేవారు సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి ఈ నెల 25 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ

కర్నూలు(స్పోర్ట్స్), ఏప్రిల్ 19: కృష్ణాజిల్లా నూజివీడు పట్టణంలో ఈ నెల 19 నుంచి 22 వరకు జరగబోయే 9వ ఆంధ్రప్రదేశ్ జూనియర్ బాలబాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టుకు శనివారం డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీలో బాస్కెట్‌బాల్ క్రీడాకారులకు డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ భూపతిరావు దుస్తులు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన భూపతిరావు మాట్లాడుతూ ఈ పోటీల్లో రాణించి జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు.

నేడు ఓర్వకల్లులో ఎన్నికల ప్రచారం

ఓర్వకల్లు, ఏప్రిల్ 19: ఓర్వకల్లు మండలంలోని గ్రామాల్లో శనివారం పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత, నంద్యాల పార్లమెంటు ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి శుక్రవారం తెలిపారు. శనివారం మండలంలోని గుట్టపాడు, ఎన్.కొంతలపాడు, ఉప్పలపాడు, ఉయ్యాలవాడ, మీదివేముల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. మండలంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

ఫొటోస్టాట్ సెంటర్లు మూసివేయాలి

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 19: ఈ నెల 21 జరగనున్న ఎస్ఎస్‌సీఏపీ ఎంఎస్-6 క్లాస్ ఎంట్రెన్స్ పరీక్షల నేపథ్యంలో జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద ఫొటోస్టాట్, ఇంటర్నెట్ సెంటర్లు మూసివేయాలని కార్మిక శాఖ ఉప కమిషనర్ కె.వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి ఉత్తర్వుల మేరకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు.

కర్నూలు అసెంబ్లీకి ఆరు నామినేషన్లు

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 19: కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి రెండో రోజు తొమ్మిది మంది నామినేషన్లు వేసినట్లు రిటర్నింగ్ అధికారి ఎ.భార్గవతేజ తెలిపారు. శుక్రవారం నగర పాలక సంస్థ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఆర్వో నామినేషన్లు స్వీకరించారు. నజీర్ అహ్మద్, ఇంతియాజ్ స్వతంత్ర్య అభ్యర్థులుగా, సోషల్ యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా పార్టీ తరఫున వడగండ్ల హరీష్ కుమార్‌రెడ్డి. బహుజన సమాజ్ పార్టీ నుంచి అరుణ్‌కుమార్(ఎస్సీ), సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి ఖలీల్ అహ్మద్‌లు ఆర్‌ఓకు నామినేషన్ పత్రాలు అందజేశారు. ఎస్‌డీపీఐ తరఫున ఖలీల్ అహ్మద్ ఇప్పటికే ఒక సెట్ నామినేషన్ పత్రాలు అందజేశారు. అయితే బీఎస్పీ అభ్యర్థి అరుణ్‌కు మార్‌కు ఒక్కరు మాత్రమే ప్రతిపాదించారు.

కమిషనర్‌ను కలిసిన అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 19: అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి నగర పాలక సంస్థ కమిషనర్, కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎ.భార్గవతేజను మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు.

రూ.988 కోట్ల విడుదలపై హర్షం

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 19: రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు రూ.988 కోట్లు విడుదల చేయడంపై ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం ద్వారా 2023-24 సంవత్సరానికి రెండో విడత రూ.988 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల అకౌంట్లో వేయ కుండా దొంగలించాలని ప్రయత్నించిదన్నారు. ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ అధ్వర్యంలో సర్పంచుల సంఘం, ప్రతినిధి బృందం ఈనెల 15న ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాను కలిసి ఫిర్యాదు చేశామన్నారు. స్పందించిన ముఖేష్‌కుమార్ మీనా వెంటనే చర్యలు తీసుకుని నిధులు విడుదల చేయించి నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

సి.బెళగల్, ఏప్రిల్ 19: పంచాయతీలలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీడీవో శకుంతల కార్యదర్శులకు ఆదేశించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీల కార్యదర్శులతో ఆమె సమావేశమయ్యారు. క్రిష్ణదొడ్డిలో కోన వెంకటేశ్వరస్వామి ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామంలో తాగునీటి సమస్య రాకుండా వారంరోజులపాటు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలన్నారు. ఈసమావేశంలో ఈవోఆర్డీ సందీప్, ఆర్‌డబ్ల్యూ ఎస్ ఏఈ గోసెనాయక్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

ఓర్వకల్లు, ఏప్రిల్ 19: కార్యకర్తలు ఎవరూ కూడా భయపడవద్దని, అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి సోదరుడు బైరెడ్డి విష్ణువర్దన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని హుశేనాపురం, సోమయాజులపల్లె, కొమరోలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగమల్లేష్, పద్మనాభం, మద్దిలేటి, గొల్ల నాగరాజు, కురువ సుంకన్న, కురువ జయన్న పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి



శింగవరంలో ప్రచారం చేస్తున్న బొగ్గుల దస్తగిరి

సి.బెళగల్, ఏప్రిల్ 19: టీడీపీ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి అన్నారు. శుక్రవారం టీడీపీ మాజీ మండల కన్వీనర్ డాక్టర్ తిమ్మప్ప ఆధ్వర్యంలో శింగవరం, కంబంధహల్ గ్రామాల్లో బొగ్గుల దస్తగిరి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తలు పార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. అనంతరం ఆయా గ్రామాలలో ఇంటింటికీ తిరిగి బాబు ష్యూరిటీ, సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఈరన్నగౌడు, మల్లికార్జునగౌడు, జడ్పీటీసీ గిరిజోన్, మాజీ ఎంపీటీసీ యాకోబు, మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మద్యం రవాణాపై విస్తృత తనిఖీలు

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 19: అక్రమ మద్యం విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సెబ్ సీఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. శుక్రవారం పంచలింగాల చెక్ పోస్టు వద్ద స్పెషల్ ఎన్ఫోర్స్ మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఉల్చాల గ్రామానికి చెందిన లక్ష్మన్న నుంచి 30 మద్యం బాటిళ్లు, ఓర్వకల్లు మండలం గుట్టపాడుకు చెందిన జీవీ శ్రీనివాసులు, శివరాముడు నుంచి 31 బాటిళ్లు, ద్విచక్ర వాహనం, పి.రుద్రవరం గ్రామానికి చెందిన పి.దీపక్ తేజ నుంచి 230 మద్యం బాటిళ్లు , ఆటోను స్వాధీనం చేసుకుని వీరిపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ తనిఖీలు సీఐలు సి. రోహినా బేగం. జీమారుతి ప్రసాద్ పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



ప్రసూనా లా కళాశాలను ప్రారంభిస్తున్న టీజీ వెంకటేశ్

కర్నూలు (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 19: ఏ ప్రభుత్వంలోనైనా ముందుగా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, ఆ తర్వాతనే మిగతా వాటి కోసం పోరాడాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. శుక్రవారం నగరంలో ఏర్పాటు చేసిన ప్రసూన లా కళాశాల నూతన భవనాన్ని దత్త విజయానందతీర్థ స్వామీజీతో కలిసి టీజీ వెంకటేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ కర్నూలులో న్యాయ కళాశాలను ఏర్పాటు చేసి వాటికి సొంత భవనం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గతంలో రాయలసీమ ప్రాంతంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వం ముందుకు వచ్చిందని వివరించారు. అయితే.. ఈ ప్రాంతంలో రెండు వర్గాల వాదనలు ఉన్నాయని.. ఒకవేళ హైకోర్టు బెంచ్‌కు ఒప్పుకుంటే హైకోర్టు రాకుండా అడ్డుకుంటున్నారని అపవాదు తనపై వేసే అవకాశం ఉన్న నేపథ్యంలో తాను ఈ అంశానికి దూరంగా ఉన్నట్లు టీజీ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధినేతలు వంకి ప్రసూన, డా.పెంచలయ్య, పాల్గొన్నారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

జవహార్ నవోదయలో ప్రేరణ ఉత్సవాలు

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్19: మండల పరిధిలోని జవహార్ నవోదయ విద్యాలయంలో శుక్రవారం ప్రేరణ ఉత్సవాలను ఏర్పాటు చేసినట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి 62 పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఇందులో 52 మంది బాలురు, 66 మంది బాలికలు ఉన్నారని తెలిపారు. ప్రిన్సిపాల్ నోడల్ అధికారినిగాను, డాక్టర్ షేక్‌రఫి డిస్ట్రిక్ లెవెల్ నోడల్ ఆఫీసర్ గా వ్యవహరించినట్లు పేర్కొన్నారు. మొత్తం 118 విద్యార్థులు పాల్గొన్నారని, అన్ని రౌండ్లు పూర్తి చేసుకొని 30మంది విద్యార్థులు ప్రతిభను కనబరిచారని పేర్కొన్నారు. ఎంపికైన 30 మంది విద్యార్థుల మార్కులను ప్రేరణ పోర్టల్‌లో నమోదు చేశామని తెలిపారు. న్యాయ నిర్ణేతలుగా కేంద్రీయ విద్యాలయం నుంచి రంగన్న, ప్రగతి కుమార్, హబీదాబి, నవోదయ విద్యాలయం నుండి బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్19: అనుకోకుండా జరిగే అగ్నిప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి రామాంజనేయులు తెలిపారు. అగ్నిప్రమాద వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని శక్తి నర్సింగ్‌హోం, శిల్పా నర్సింగ్‌హోంలలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డెమో ప్రదర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో పాటు వారి సూచనలు పాటించి ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు. అంతకుముందు వాల్‌పోస్టర్లను డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ శిల్పా ఆవిష్కరించారు. ఫైర్ సిబ్బంది సర్దార్‌బాషా, మహబూబ్‌బాషా, మక్బుల్ సాహెబ్, అంజినయ్య, లక్ష్మన్న, విశ్వనాథ్‌రెడ్డి, పరమేష్ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

తుగ్గలి, ఏప్రిల్ 19: వివాహిత మహాలక్ష్మి (20) నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జి.ఎర్రగుడి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. ఎర్రగుడి గ్రామానికి చెందిన ఫక్కీరప్ప, లింగమ్మ దంపతుల కుమారుడు మహేష్‌కు అదే గ్రామానికి చెందిన వెంకటేశ్, ఆదిలక్ష్మీ దంపతుల కుమార్తె మహాలక్ష్మిని ఇచ్చి 8 నెలల క్రితం వివాహం జరిపించారు. శుక్రవారం సాయంత్రం చిన్నవిషయంపై గొడవ పడి మహాలక్ష్మి క్షణికావేశానికి గురై ఇంట్లోని గదిలోకి వెళ్లి కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. దీంతో భర్త మహేష్ ఆమెను కాపాడి గుత్తి వైద్యశాలకు చికిత్స నిమ్మితం తరలించారు. మహాలక్ష్మికి తీవ్రగాయాలు కాగా, కాపాడబోయిన మహేష్‌కు నిప్పంటుకుని గాయాలయ్యాయి. మహాలక్ష్మిని మెరుగైన వైద్యం కోసం కర్నూలు వైద్యశాలకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జొన్నగిరి ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు.

టీడీపీ గూటికి సీనియర్ నేత నారాయణ రెడ్డి

ఆలూరు, ఏప్రిల్ 19: టీడీపీ సీనియర్ నేత, రాష్ట్ర రైతు సంఘం నాయకులు నారాయణ రెడ్డి తిరిగి సొంతగూటికి చేరారు. పార్టీలోని విభేదాల కారణంగా 6 నెలల క్రితం టీడీపీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం టీడీపీ జోనల్-5 ఎన్నికల ఇన్‌చార్జి వైకుంఠం ప్రభాకర్ చౌదరి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాంభీం నాయుడు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కృష్ణం నాయుడు ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు.

19ఏడీఎన్3: మాట్లాడుతున్న ఆదోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి శివ్‌నారాయణ్ శర్మ

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించొద్దు : ఆర్‌ఓ

ఆదోని, ఏప్రిల్ 19: అభ్యర్థులు ఎన్నికల నియమావళి తప్పకుండా పాటించాలని రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్, ఎన్నికల అధికారి శివ్‌నారాయణ శర్మ అన్నారు. శుక్రవారం తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటివరకు ఇద్దరు నామినేషన్లను దాఖలు చేశారన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటమన్నారు.

అర్దగేరి గ్రామ వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరిక

ఆలూరు, ఏప్రిల్ 19: హాలహర్వి మండలం అర్దగేరి గ్రామం వైసీపీ నాయకులు పిన్ని రామంజిని, సానకనూర్ గణపతి, సానకనూర్ రామయ్య కంటింటి వెంకటరాముడు, పట్టాభి నాగరాజు ఆధ్వర్యంలో 30 మంది టీడీపీ అభ్యర్థి వీరభద్ర గౌడ్ సమక్షంలో శుక్రవారం టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఉపాధి సిబ్బందికి వేతనాలు చెల్లించండి

తుగ్గలి, ఏప్రిల్ 19: ఉపాధి హామీ పథకం కింద పని చేసే ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేట్లకు వేతనాలు చెల్లించాలని ఆ సంఘం నాయకులు శేఖర్ రెడ్డి, బాలు, సందీప్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వారు మాట్లాడుతూ మూడు నెలల నుంచి ఫీల్డ్ అసిస్టెంట్, సీనియర్ మేట్లకు వేతనాలు అందడం లేదని పేర్కొన్నారు.

నామినేషన్ దాఖలు చేసిన మురహరిరెడ్డి

ఎమ్మిగనూరు /రూరల్, ఏప్రిల్19: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎమ్మిగనూరు బీజేపీ కన్వీనర్ కె.ఆర్ మురహరిరెడ్డి తన నామినేషన్‌ను దాఖలు చేశారు. శుక్రవారం ఎమ్మిగనూరు పట్టణంలో హెచ్‌బీఎస్ కాలనీలో ఉన్న బీజేపీ కార్యాలయం నుంచి కార్యకర్తలతో ర్యాలీగా వెళ్లి సోమప్ప సర్కిల్ చేరుకొని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్వో చిరంజీవికి తన నామినేషన్‌పత్రాన్ని అందజేశారు. పార్టీ అధిష్టానం పునరాలోచించి తనకు బిఫారం అందజేస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

బాబు సభ సక్సెస్

● ఆలూరు పసుపు మయం ● భారీగా తరలివచ్చిన జనం

ఆలూరు/ఆదోని, ఏప్రిల్ 19 : టీడీపీ అధినేత నారాచంద్రబాబు నాయుడు శుక్రవారం ఆలూరులో చేపట్టిన ప్రజాగళం యాత్ర విజయవంతం అయ్యింది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, జనం పోటెత్తడంతో పట్టణం పసుపుమయంగా మారింది. ఎల్లార్తి రోడ్డు, ఆదోని రోడ్డు, బళ్లారి రోడ్డు ఎటు చూసినా జనప్రభంజనమే కనిపించింది. అంబేడ్కర్ సర్కిల్‌లో జరిగిన రోడ్‌షోలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బి.వీరభద్రగౌడు, కర్నూలు ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజుతో కలిసి చంద్రబాబు మాట్లాడారు. రాబోయే ఎన్డీయే సారథ్యంలోని ప్రజాప్రభుత్వంలో ఆలూరు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తామని వరాల జల్లులు కురిపించారు. "8 టీఎంసీలతో వేదవతి ప్రాజెక్టు పూర్తి చేసే బాధ్యత తీసుకుంటా.. నదిలో నీరు లేకపోతే హంద్రీనీవా కాలువ ద్వారా నీళ్లు నింపి కరువు నేలకు మళ్లిస్తా. టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తాం. ఆదోనిలో మిరప ప్రత్యేక మార్కెట్ ఏర్పాటు, డిగ్రీ కళాశాలకు ప్రత్యేక భవనాల నిర్మాణం, జాతీయ రహదారితో పాటు ఆలూరు, హొళగుంద రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామని" హామీ ఇచ్చారు. అదే క్రమంలో ఈ ప్రాంతంలో అధికంగా ఉన్న బుడగజంగాలకు ఎస్టీ సర్టిఫికెట్లు ఇప్పిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు.



● కురువలను గుర్తించిన పార్టీ తెలుగుదేశం

కురువలను గుర్తించి కర్నూలు పార్లమెంట్ టికెట్ ఇవ్వడం సంతోషంగా ఉందని టీడీపీ కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి పంచలింగాల నాగరాజు అన్నారు. ఆలూరులో ప్రజాగళం సభలో ఆయన మాట్లాడుతూ వెనుకబడిన ఆలూరు నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. ప్రాజెక్టులు పూర్తి కావాలంటే అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రజలు అభివృద్ధి చేసే టీడీపీ పార్టీకి పట్టం కట్టాలని కోరారు.

అవకాశం ఇస్తే ఆలూరు అభివృద్ధి చేసి చూపుతాం

ఆదరించి అవకాశం ఇస్తే ఆలూరును అభివృద్ధి చేసి చూపుతామని టీడీపీ ఆలూరు అభ్యర్థి వీరభద్రగౌడ్ అన్నారు. ఆలూరులో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాగళం సభలో ఆయన మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వేదావతి ప్రాజెక్ట్, నగరడోణ ప్రాజెక్టును పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. జగన్ మాయామాటలు నమ్మి మోసవపోవద్దని కోరారు.





ఆలూరు ప్రజాగళం సభలో మాట్లాడుతున్న టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, చిత్రంలో వీరభద్రగౌడ్, బస్తిపాటి నాగరాజు, తిక్కారెడ్డి, హాజరైన జనం

అభ్యర్థులను గెలిపించండి



చంద్రబాబుతో వైకుంఠం శివప్రసాద్, జ్యోతి

ఆలూరు, ఏప్రిల్ 19: రానున్న ఎన్నికల్లో మీ నియోజక వర్గ టీడీపీ అభ్యర్థుల గెలుపుకోసం పని చేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు ఆదోని డివిజన్ టీడీపీ సీనియర్ నాయకులకు సూచించారు. శుక్రవారం ప్రజాగళం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆలూరుకు వచ్చిన ఆయన ప్రత్యేకంగా బస్సులో మాట్లడారు. ఆలూరు టీడీపీ అభ్యర్థి వీరభద్ర గౌడ్ గెలుపు కోసం పని పనిచేయాలని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజంగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ జ్యోతి దంపతులకు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కప్పట్రాళ్ల బుజ్జమ్మ, రామచంద్ర నాయుడులకు సూచించారు. అలాగే ఆదోని ఉమ్మడి కూటమి అభ్యర్థి డాక్టర్ పార్థసారథి గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడుకు సూచించారు. పత్తికొండ ఎమ్మెల్యే అభ్యర్థి శ్యాంబాబు గెలిపించుకురావాలని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజిగ్ కార్యదర్శి తుగ్గలి నాగేంద్రకు సూచించారు.

● సభలో నేతలకు భరోసా...

ఆలూరులో నిర్వహించిన ప్రజాగళం ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు టీడీపీ నేతలకు భరోసా ఇచ్చారు. ఆలూరులో వైకుంఠం కుటుంబం తనకు అండగా ఉందని, ఆయన కుమారుడు వైకుంఠం శివప్రసాద్, జ్యోతి పార్టీలో చాలా చురుకుగా పని చేస్తున్నారన్నారు. కొందరు స్వార్థంతో అటుపోయిన వైకుంఠం శివప్రసాద్ పార్టీలోనే ఉన్నారు. వారికి. తప్పకుండా ప్రాధాన్యత కల్పిస్తామని భరోసా ఇచ్చారు. అలాగే దివంగత నేత కప్పట్రాళ్ల వెంకటప్ప నాయుడును దారుణంగా హత్య చేశారని, ఆయన కూతురు కప్పట్రాళ్ల బుజ్జమ్మకు కూడా న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.

వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పాలి : కేఈ



కేఈ సమక్షంలో టీడీపీలో చేరిన మారెళ్ల, లింగనాయనదొడ్డి గ్రామస్థులు

మద్దికెర, ఏప్రిల్ 19: వైసీపీ హత్యారాజకీయాలు, దౌర్జన్యాలు, కోడి కత్తి, గులకరాయి డ్రామాలు, అవినీతి అరాచక పాలనకు ప్రజలు తమ ఓటుతో బుద్ధి చెప్పాలని టీడీపీ కూటమి అభ్యర్థి కేఈ శ్యాంబాబు అన్నారు. శుక్రవారం మద్దికెర గ్రామంలోని కురువ కులస్థుల ఆరాధ్య దేవుడైన బీరప్ప స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా బీరప్పస్వామి దేవాలయ నిర్వాహకులు కేఈ శ్యాంబాబుతో ప్రత్యేక పూజలు చేయించి సన్మానించారు. అనంతరం కేఈ మాట్లాడుతూ నిత్యావసర ధరలను పెంచి ప్రజల నెత్తిపై భారం మోపిన వైసీపీకి ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మాజీ జడ్పీటీసీ సభ్యులు జమేదార్ రాజన్న యాదవ్, మండల టీడీపీ ఇన్‌చార్జి దివాకర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరిక

తుగ్గలి: వైసీపీ, సీపీఐకి చెందిన మారెళ్ల, లింగనాయనదొడ్డి గ్రామాల నుంచి 39 కుటుంబాలు కేఈ శ్యాంబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. పత్తికొండ టీడీపీ కార్యాలయంలో మారెళ్ల ఉప సర్పంచు రామాంజనేయులు, వార్డు మెంబర్ యశోదమ్మలతో పాటు 25 కుటుంబాలు టీడీపీలో చేరారు. అలాగే లింగనాయనదొడ్డి గ్రామానికి వైసీపీకి చెందిన దాసరి రామకృష్ణ, వెంకటేశ్వర్లుతో పాటు దాదాపు 14 కుటుంబాలతో పాటు టీడీపీలో చేరారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

● ఎన్నికల వ్యయ పరిశీలకులు రాకేష్ బడాదియ



ఢనాపురం చెక్‌పోస్టు దగ్గర ఉన్న స్టాటిస్టిక్స్ సర్వేలెన్స్ నిర్వహిస్తున్న విధులను పరిశీలిస్తున్న రాకేష్ బడాదియా

ఆదోని, ఏప్రిల్ 19: ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిస్టిక్స్ సర్వేలెన్స్ బృందాలు వారికి కేటాయించిన ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించడమే కాకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకులు రాకేష్ బడాదియా (ఐఆర్ఎస్) అన్నారు. శుక్రవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆదోని సబ్ కలెక్టర్, ఎన్నికల అధికారి శివ్‌నారాయణ్ శర్మతో కలిసి వ్యయ పరిశీలకుల బృందం, వీడియో సర్వేలెన్స్ బృందం, వీడియో వీవింగ్ బృందం, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టిక్స్ బృందాలకు, సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టిక్స్ బృందాల విధులు, బాధ్యతలు, ఫిర్యాదుల పై తక్షణమే స్పందించడం, నిరంతరం తనిఖీ నిర్వాహణ, ఈఎస్ఎంఎస్ అప్లికేషన్, సీ-విజిల్ యాప్ తదితర అంశాల పై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి అప్పమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలలో విధిగా పాటించాలని, అన్ని పార్టీల అభ్యర్థుల పట్ల నిబంధనలకు అనుగుణంగా సమదృష్టితో వ్యవహరించాలని అన్నారు. ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలకు గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే విధంగా నగదు, మద్యం, ఇతర వస్తువులు పంపిణీ పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. అనంతరం ఢనాపురం చెక్‌పోస్టు దగ్గర ఉన్న స్టాటిస్టిక్స్ సర్వేలెన్స్ నిర్వహిస్తున్న విధులను ఎన్నికల వ్యయ పరిశీలకులు రాకేష్ బడాదియా, సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ అకస్మికంగా తనిఖీ చేశారు.

కూటమి అభ్యర్థి పార్థసారథి నామినేషన్



నామినేషన్ వేస్తున్న కూటమి అభ్యర్థి డాక్టర్ పార్థసారథి

ఆదోని, ఏప్రిల్ 19: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి అభ్యర్థి డాక్టర్ పార్థసారథి ఆదోని అసెంబ్లీ స్థానానికి తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. శుక్రవారం పార్థసారథి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, గుడిసె కృష్ణమ్మ, మదిరే భాస్కర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రామచంద్ర, అప్సర్ బాషా, బీజేపీ రాష్ట్ర నాయకుడు చంద్రమౌళితో కలిసి ఎన్నికల రిటర్నింగ్ అధికారి సబ్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మకు తన నామినేషన్ పత్రాలను ఒక సెట్టును అందజేశారు. అనంతరం మీనాక్షినాయుడు మాట్లాడుతూ కూటమి అభ్యర్థి డాక్టర్ పార్థసారధిని గెలిపించుకుంటామని అన్నారు. బీజేపీ నాయకులు నాగరాజుగౌడ్, టీడీపీ నాయకులు బుద్దారెడ్డి, శ్రీరాములు పాల్గొన్నారు.

రెండో రోజు ఒకే నామినేషన్ దాఖలు

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్19: నియోజకర్గంలో రెండవ రోజు శుక్రవారం ఒకే నామినేషన్ దాఖలైనట్లు ఆర్వో చిరంజీవి తెలిపారు. ఆయన మాట్లాడుతూ కె.ఆర్ మురహరిరెడ్డి మాత్రమే నామినేషన్ దాఖలు చేశారని పేర్కొన్నారు. సాయంత్రం 3గంటలు దాటినా ఎవరూ నామినేషన్ దాఖలు చేసేందుకు రాలేదని వివరించారు.

పత్తికొండలో నాలుగు నామినేషన్ల దాఖలు

పత్తికొండ, ఏప్రిల్ 19: అసెంబ్లీకి ఎన్నికలకు సంబంధించి రెండో రోజు శుక్రవారం నియోజకవర్గంలో నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయని ఆర్వో రామలక్ష్మి తెలిపారు. టీడీపీ అభ్యర్థి కేఈ శ్యాంబాబు, ఇండియా కూటమి అభ్యర్థి రామచంద్రయ్య, వైసీపీ అభ్యర్థి కంగాటి శ్రీదేవి, వైసీపీ తరుపున రామ్మోహన్ రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారని ఆర్వో తెలిపారు. ర్యాలీగా వచ్చి వైసీపీ అభ్యర్థి కంగాటి శ్రీదేవి నామినేషన్ వేయగా.. మంచి రోజు కావడంతో మొదటి సెట్ కింద కేఈ శ్యాంబాబు, రామచంద్రయ్య నామినేషన్లు దాఖలు చేశారు. శ్రీదేవి కుమారుడు రామ్మోహన్ తల్లి శ్రీదేవికి మద్దతుగా వైసీపీ తరుపున నామినేషన్ దాఖలు చేశారు. 22న ఇండియా కూటమి అభ్యర్థి రామచంద్రయ్య, 24న టీడీపీ అభ్యర్థి కేఈ శ్యాంబాబులు భారీ ర్యాలీతో నామినేషన్లు వేయనున్నట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

ఆలూరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అరకట్ల నవీన్ కిషోర్

● ప్రకటించిన పీసీసీ అధ్యక్షురాలు షర్మిల



ఆలూరు కాంగ్రెస్ అభ్యర్థిని పరిచయం చేస్తున్న షర్మిల

ఆలూరు, ఏప్రిల్ 19: ఆలూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అరకట్ల నవీన్ కిషోర్‌ను పీసీసీ అధ్యక్షురాలు షర్మిల శుక్రవారం ప్రకటించారు. బీజేపీ పార్టీలో పని చేసిన నవీన్ కిషోర్‌ను కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించడం పట్ల స్థానిక నేతలు తీవ్ర అంతృప్తితో వేదిక నుంచి వెళ్లిపోయారు.

అభ్యర్థుల ఖర్చులపై దృష్టి సారించండి

మంత్రాలయం, ఏప్రిల్ 19: మంత్రాలయం నియోజకవర్గంలో ఎన్నికల్లో పోటీ చేసే ఆయా పార్టీల అభ్యర్థుల ఖర్చుపై అధికారులు దృష్టి సారించాలని ఎక్స్‌పెండీచర్ పరిశీలకులు రాకేష్ బడాదియా అన్నారు. శుక్రవారం మంత్రాలయం ఆర్వోలతో ప్రత్యేక సమావేశమయ్యారు. వారితో ఎక్స్‌పెండీచర్ ఖర్చులు ఎంత చేస్తున్నారూ.. డబ్బు సరఫరాపై దృష్టి సారించి నివేధిక సమర్పించాలని తెలిపారు. అనంతరం చిలకలడోన వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టును తనిఖీ చేసి పలు సూచనలు చేశారు.

ఐదేళ్లలో అభివృద్ధి శూన్యం : బీవీ

● ఎమ్మిగనూరులో బీవీ విస్తృత ప్రచారం

ఎమ్మిగనూరు , ఏప్రిల్19: ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని 9వ వార్డులో స్థానిక నాయకులు కటారి రాజేంద్రతో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ముందుగా వార్డులోని పలువురు మహిళలతో ముఖాముఖి సమావేశం నిర్వహించి సమస్యలు తెలుసుకున్నారు. టీడీపీ ప్రవేశపెట్టబోయే సూపర్-6 పథకాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణంలో తన తండ్రి, తాను చేసిన అభివృద్ధి మినహా వైసీపీ చేసిందేమీలేదన్నారు. మూడు పూటలా తాగునీరు అందించాలన్న లక్ష్యంతో జీడీపీ నుంచి రూ.146 కోట్లతో పైపలైన్ మంజూరు చేయిస్తే ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఏ మాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పథకాన్ని పూర్తి చేసి తాగునీరు అందిస్తామన్నారు. అలాగే టిడ్కో గృహాలన్ని లబ్ధిదారులకు వెంటనే అందజేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో టీడీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు రాందాసుగౌడు, ముల్లాఖలీముల్లా, తురేగల్ నజీర్, అంబేద్కర్ తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు.



పట్టణంలోని 9వ వార్డులో మహిళలతో మాట్లాడుతున్న బీవీ జయనాగేశ్వరరెడ్డి



కలుగొట్ల, కె.నాగలాపురం గ్రామాల్లో 'మన ఊరు- మన బీవీ'

ఎమ్మిగనూరు రూరల్: కలుగొట్ల, కె.నాగలాపురం గ్రామాల్లో బీవీ జయనాగేశ్వరరెడ్డి మన ఊరు-మన బీవీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడారు. అభివృద్ధి జరగాలంటే తెలుగుదేశం పార్టీ గెలవాలని సూచించారు. కలుగొట్ల గ్రామంలో బీవీ జయనాగేశ్వరరెడ్డికి పూలదండ వేసేందుకు ఓ కార్యకర్త కుమారుడు ప్రచార వాహనం ఎక్కగా ఆ చిన్నారికే పూలహారం వేసి జయనాగేశ్వరరెడ్డి అభినందించారు. ఆ చిన్నారి విక్టరి సింబల్ చూపుతూ గ్రామస్థులను అలరించాడు. టీడీపీ నాయకులు కొండన్నగౌడు, రామలింగడు, శంకర్‌గౌడు, రాళ్లదొడ్డి మురళి తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయంలో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లు

మంత్రాలయం, ఏప్రిల్ 19: మంత్రాలయం ఎమ్మెల్యే అభ్యర్థికి ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆర్వో మురళి, అసిస్టెంట్ ఆర్వో శ్రీధర్‌మూర్తి తెలిపారు. రెండో రోజు శుక్రవారం కోసిగి మండలం కోల్‌ఆన్‌పేట గ్రామానికి చెందిన గుడిసె రామాంజనేయులు, పెద్దకడుబూరు మండలం హనుమాపురం గ్రామానికి చెందిన చక్కెర పరమేష్‌లు నామినేషన్లు దాఖలు చేశారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

తుగ్గలి, ఏప్రిల్ 19: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు తుగ్గలి, జొన్నగిరి ఎస్‌ఐలు మల్లికార్జున, రామాంజనేయు అన్నారు. శుక్రవారం మండలంలోని తుగ్గలి, జొన్నగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో వారు పర్యటించి ఎన్నికల నియామవళి, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

పేదల అభ్యర్థిని గెలిపించండి : సీపీఐ

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 19: రైతు, కార్మిక నిరుపేదల సమస్యల సాధనకై నిరంతరం పోరాడే పేద ప్రజల సీపీఐ కమ్యూనిస్టు అభ్యర్థిని గెలిపించి అసెంబ్లీకి పంపాలని సీపీఐ అసెంబ్లీ పత్తికొండ అభ్యర్థి రామచంద్రయ్య ప్రజలను కోరారు. శుక్రవారం పట్టణంలోని రామకృష్ణారెడ్డి నగర్, బుడగ జంగాల కాలనీలో సీపీఐ అభ్యర్థి రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి గిడ్డయ్య విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తికొండ ప్రాంతంలో అనేక సమస్యలపై పోరాటాలు చేసిన చరిత్ర కమ్యూనిస్టులదేనని అన్నారు.

తాగునీటి కొలాయిలు, రోడ్లు ఏర్పాటు చేయాలి

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 19: పట్టణంలోని సంజీవయ్య నగర్‌లో తాగునీటి పైపులు, రోడ్లు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు రాముడు కోరారు. శుక్రవారం కాలనీవాసులు తిమ్మప్ప, సిద్దయ్య, పార్వతమ్మ, కళావతి, జరినా, లక్ష్మన్న, బంగారయ్యతో కలిసి మున్సిపల్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు.